

# కట్టుగొయ్యి

కాట్రగడ్డ దయానంద్

దబరాలో వండిన కూడు వండినట్టే ఉందయ్యా! ఏందా తినడం..'' కసురుకుంది లక్ష్మమ్మ.

''తిన్నకాడికి చాల్లేవే! తిని ఎవుర్ని ఉద్ధరించను.''

మోకాలి గిలక సర్దుకుంటూ పీటమీదనుంచి పైకి లేచాడు వెంకటేశ్వర్లు. పైకండువాకు చేతుల్ని తుడుచుకుంటూ నోట్లో నీళ్ళు



పుక్కిలించి ఇంట్లో నుంచి పంచలోకి ఆపైన ఆరుబయటకు వచ్చి నోట్లో నీళ్ళను ఊసేడు. మూతిని తుడుచుకుంటూ బఆె గొడ్ల కట్టు మట్లవైపు చూచేడు.

అక్కడంతా చీకటి.. ఏ అలికిడీ లేదు.

చీకట్లో సైతం శుభ్రంగా కసువు ఊడ్చి అలికినట్లుగా ఉంది.

ఇంకా దూరంగా ముసురుకున్న చీకట్లోకి చూచాడు.

నిరాశగా ఆకాశంలోకి చూచాడు.

మినుకు మినుకుమంటూ చుక్కలు..

గడ్డివామివైపు చూచేడు. నాలుగురోజులైంది. చల్లటి చలి వణికిస్తోంది. పల్లెటూరైనా మనుషులందరూ ఇల్లల్లో బొమ్మలపెట్టె చుట్టూ మూగి చలి కాచుకుంటున్నారు.




అప్పుడప్పుడూ కుక్కల అరుపులు...

తిని ఎప్పుడొచ్చిందో లక్ష్మమ్మ. కుడితిగాబు మురుగాసన లేచిందయ్యా! దొర్లిస్తే నన్నా పోతుందేమో..'' అంటూ పల్లెంలో ఎంగిలినీళ్ళను కుడితి తొట్టిలో పోసింది. డెబ్బై ఏళ్ళ వెంకటేశ్వర్లు మరేమీ మాట్లాడలేదు.

సల్లగాలికి బయటెందుకు? లోనకుపా, ఈనాలుగు రోజుల్నుంచి కంటిమీద కునుకు లేకుండా ఉన్నావు. మద్దేల అబ్బాయి ఫోను చేసేడంట. ఇద్దరం ఇంటికాడ లేకపోతిమి. పోతే పోయినై. తిరిగినకాడికి సాలు. ఆశోదులుకోమన్నాడంట.''

''వాడికేమే! అట్టనే చెబుతాడు. ఒకటా రెండా! అయ్యిపోతే మనకు దిక్కెవురే! వాడు పెట్టిపోషిస్తాడుగామాల. వాళ్ళ బతుకులు వాళ్ళు బతికితేసాలు. గొడ్డిలవ వాడికేం తెలుసుద్దిలే. గమ్మునుండు.'' నోరిప్పేడు వెంకటేశ్వర్లు.

''నిజమే! తెలీదు. అయితే ఏంచేస్తా? రోజులు గడిచేకొందీ నాక్కూడా నమ్మకం పోతంది. ఏదున్నా ఎటుబోయినా ఇమ్మేరికి తిరిగి రావల్సింది గదా! నాలుగు రోజులైనా రాలేదంటే దొంగలు దాటేసేరేమోనని అనుమానం గుందయ్యా. ఇప్పటికిప్పుడు అమ్ముకున్నా డెబ్బై ఎనబై వేలు ఎటూ పోవు...'' లక్షుమ్మ అంది.

''డబ్బిలవగాదే పిచ్చిదానా! వాటికి మనమూ, మనకు అయ్యే తోడె గదా! ఏళ్ళతరబడి వాటిని మనం పోషణ చెయ్యటం, నోరులేని జీవాలు మనల్ని కనిపెట్టుకుని ఉండటం- వాటిల్లో ఒక్కటన్నా మన ఇంటి పుట్టనిదుందా చెప్పు. ఇంటి ముందు పశువుల్లేకపోతే ఎట్టుందో చూడు..'' వెంకటేశ్వర్లు గొంతు పూడుకుపోయింది.

''ఏం చేద్దాం? మనరాతా వాటిరాతా అట్టుంటే. ఇంకా నయం. తూరుప్పక్క పాళేలకు పాళేల్ని ముంచేసిందంట సముద్రం. ఇల్లూ, మనుషులూ, పైర్లూ ఏయీ మిగల్లేదంట.'' లక్షుమ్మ గొంతులో కూడా ఒక దుఃఖపు తెర..

వెంకటేశ్వర్లు కుడికాలుని మెల్లగా ఈడుస్తూ ఇంట్లోకి చేరి మంచమ్మీద కూర్చున్నాడు. కరంటు బల్బు వెలుగుతున్నా ఇల్లంతా చీకట్లు ముసిరినట్టుగా ఉంది.

నాకైతే గొడ్లు ఇంటికొస్తాయనే గెట్టినమ్మకమే. మచ్చలపడ్డ ఈన మోసి ఉంది. ఎట్టుందో ఏమో. మళ్ళీ ఒకమాలి ఏటొడ్డున ఎతికితే బాగుండేమోననిపిస్తంది.''

''అమ్మేవ్! నీ ఎర్రిగాని, ఇప్పటికెతికింది సాలు. ఉంటే ఏడకుబోతయి ఇంటికి రాకుండా. నిన్నా మొన్నా గొడ్లు తోలుకుని జనమంతా ఏటికాడకు పోతానే ఉంటిరి. గంటే జనాల కంట్లో పడవా! మొన్నంతా చిలకలూరిపేట అద్దంకి సంతని తిరిగొస్తివి. నిన్నంతా కావిలి, సింగరాయకొండ సంతని పోయొస్తివి. కనిగిరి సంతని కాలూ కాలూ కొట్టుకుని పోతివి. ఇంకేం గొడ్లయ్యా! పడుకో. వాటికి మనకూ రుణం తీరిపోయింది. తిరిగి తిరిగి నువ్వడ్డం బడితే నేనేంగావాల. మనం బాగుంటే పిల్లలిద్దరూ నాలుగు రాళ్ళు పంపితే కాస్తో కూస్తో గెంజికాసుకుని తాగొచ్చు.'' ఆమె మాటలు సన్నటి ఏడుపులోకి మారిపోయింది.

''ఏడిస్తే వస్తయ్యంటే! పోతే పోయినియ్యిలే. దిగులు పడమాకు. మన తలరాత అట్టుంది. ఎట్ట జరగాలో అట్ట జరుగుద్ది.'' కాళ్ళకున్న మట్టి తుడుచుకుని వెల్లకిలా వాలి పడుకున్నాడు వెంకటేశ్వర్లు. పడుకున్నారేగాని ఇద్దరికీ నిద్రపట్టలేదు. ఇద్దరి మనసుల్లోనూ నాలుగు రోజుల్నాడు జరిగిందే కళ్ళ ముందు కదిలాడుతోంది.

***

రోజులానే ఆరోజూ వెంకటేశ్వర్లు పశువుల్ని మేపుకుంటూ గుళ్ళకమ్మ ఒడ్డుకు చేరేరు. నీళ్ళు తాగడానికి ఏట్లోకి దిగిన పశువులు ముట్టెతో నీళ్ళు వాసన చూచేయి గాని కాసిని కూడా తాగలేదు. గొడ్ల కాపరులు ఏటొడ్డున చిల్ల చెట్ల కిందకు ఎవురి తావుల్లో వాళ్ళు ఒదిగిపోయి తెచ్చుకున్న అన్నం తినసాగేరు. వెంకటేశ్వర్లు, కాపు గారి బుడ్డోడు చేతులు కడుక్కోడానికి రేవులోకి దిగి నోట్లో నీళ్ళు పోసుకుంటే ఉప్పంగా తగిలేయి.

''ఏంది మామా! ఈయాలప్పుడు నీళ్ళు ఉప్పంగా ఉన్నయ్యేంది.''

వెంకటేశ్వర్లు నీళ్ళు థుపుక్కున ఊసి...

''ఏందోరా! పోటప్పుడు తప్పితే నీళ్ళెప్పుడూ ఇట్టుండవే! వాతావరణమేదో మార్పు గందరా!'' అన్నాడు.

''విన్నావా మామ. సముద్రం హోరుగూడా భైమని వినబడుతోంది.'' చెవులు రిక్కించి వింటూ అన్నాడు వాడు.

అక్కడికి అయిదారు మైళ్ళ అవతలనే గుళ్ళకమ్మ సముద్రంలో కలుస్తోంది.

గాలివాన గూడా ఏం లేదురా! అయినా మనకేం తెల్సులే. నీళ్ళు చూడు ఎట్లా నురగలు తేలతున్నాయో'' మాట్లాడుకుంటూ ఇద్దరూ అన్నాలు తిన్నారు. కండువాలు పరుచుకుని గొడ్లను తేరిపార చూచి నడుం వాల్చారిద్దరూ. పడుకున్న కాసేపటికి తూర్పు వైపునుంచి తెరలు తెరలుగా కేకలు వినబడుతూ జనం అరుస్తుంటే లేచి కూర్చున్నారిద్దరూ. అప్పటికే గుళ్ళకమ్మ పొంగుతున్నట్టుగా నీటి మట్టం ఎన్నడూ లేనంతగా పెరిగి పోయి ఉంది. ఎప్పుడో వానాకాలంలో ఉరకలు పరుగులు మీదుండే గుళ్ళకమ్మ బుసబుసమని పొంగుతూ తెల్లటి నురగతో దరుల్ని కోసి వేస్తూ కనబడుతోంది.

''ఇదేంది మామా! మిడిమేలంగా ఉంది ఏరు'' అంటూ కాపుగారి బుడ్డోడు గబుక్కున లేచాడు. వెంకటేశ్వర్లు గూడా గభాలున లేవబోయి మోకాలి చిప్ప కటుక్కుమనగానే మళ్ళీ కింద కూలబడ్డాడు. కాసేపు కూర్చుని స్థిమిత పడ్డాక చేత్తో మోకాలి చిప్పను సరిచేసుకుని నేలమీద చెయ్యి ఆనించి మెల్లిగా పైకి లేచేడు.

''సముద్రం పొంగిందంట. పాలేన్ని ముంచేసిందంట. పల్లెకారులందరూ ఊళ్ళొదిలి పోతున్నారంట.'' అంటూ ఏటొడ్డుకు గొడ్లను తోలుకొచ్చిన వాళ్ళంతా హడావుడిగా గొడ్లను పొలాల్లోకి మళ్ళించి ఊరివైపు పరుగులు తీస్తున్నారు.

గుండ్లకమ్మ ఒడ్డంతా అల్లకల్లోలంగా తయారైంది.

వెంకటేశ్వర్లు లేచి తేరిపార చూచేటప్పటికి అందరూ ఏటికి పరుగులు తీస్తూ గొడ్లను అదిలిస్తున్నారు. వెంకటేశ్వర్లుకి తన గొడ్ల జాడ కనబడలేదు. చుట్టూ చూచేడు. అవి రోజూ పడుకునే గుళ్ళకమ్మ నీళ్ళ తావుల్లోకి చూచేడు. చిల్ల చెట్ల అవతలకు చూచేడు. ఎక్కడా వాటి జాడ లేదు. గుళ్ళకమ్మ నీళ్ళు ఒడ్లుని కోసుకుని మరింతగా నీటిమట్టం పెరుగుతోంది.

''దా! దా!'' అంటూ నాలికతో రిచ్చగొట్టి గొడ్లను పిలిచేడు. మరింత బిగ్గరగా అరుస్తూ అటూ ఇటూ తిరిగేడు.

''పరుగెత్తు మావా!'' కాపుగారి బుడ్డోడు దూరాన ఎక్కడో ఉండి అరుస్తున్నాడు.

''గొడ్లేయిరా?'' అన్నాడు కేకపెడుతూ వెంకటేశ్వర్లు.

''అయ్యే వస్తయిలే! నువ్వు తొందరగా రా'' వాడి గొడ్లను అదిలిస్తూ పరుగెత్తిస్తున్నాడు వాడు.

ఆ రేత్రికి ఊళ్ళోని గొడ్లన్నీ కట్టుగొయ్యలికి చేరేయి గాని తూరుప్పక్క వెంకటేశ్వర్లు గొడ్లు మాత్రం రానేలేదు. మూడోరోజుగ్గాని గుళ్ళకమ్మ ఉరవడి తగ్గలేదు.

***

తొలికోడి కుయ్యక ముందే మంచం దిగేడు వెంకటేశ్వర్లు. శబ్దంగాకుండా తలుపు గొళ్ళెం తీసి లక్ష్మమ్మకు తెలీకుండా బయటకు వచ్చేడు. ఆకాశం వైపు చూచేడు. చంద్రుడు గుడ్డిగా వెలుగుతున్నాడు. తూర్పున పొడిచిన చుక్క అంతకన్నా ప్రకాశవంతంగా వెలుగుతోంది. దండెమ్మీది పై కండువా తీసి విదిలించి తల చుట్టూ చెవుల చుట్టూ కట్టుకున్నాడు. మూలనున్న చేతికర్రను అందుకున్నాడు.

ఎప్పుడొచ్చి నిలబడిందో లక్షుమ్మ గూడా తలకు గట్టిగా గుడ్డ చుట్టుకుని నిలబడుంది.

''నువ్వేడకే! ఇంత సలిలో.'' అన్నాడు వెంకటేశ్వర్లు. ఆమె మాట్లాడలేదు.

మాటల్లేకుండానే ఇద్దరూ మంద బయటకు వచ్చేరు. వీధిలైట్లు మంచులో పొగ బారినట్లు వెలుగుతున్నాయి. ఊరుదాటేవరకు దారి సరిగ్గా కనబడలేదు. పల్లె దాటేరు కాపుగారి కొష్టాలు దాటేరు. చుక్కల వెల్తురు పరుచుకుని ముందున్న దారి స్పష్టంగా కనబడుతోంది. అలవాటైన దారిలో చకచకా నడుస్తున్నారు. బాడవ చెరువు దగ్గరకు రాగానే వెంకటేశ్వర్లు ''దా!దా!'' అంటూ కేకేసేడు.

ఇద్దరూ మార్చి మార్చి అరిసేరు.

ఎక్కడా ఏ అలికిడి లేదు. పొలాల మీద నల్లటి నీడ పరుచుకుని ఉంది. అప్పుడప్పుడు పొలాల్లోని చెట్లమీద అలికిడి...

అడవి పందుల గుంపొకటి క్రీచుమంటూ వాళ్ళ ముందునుంచే శనగ చేనును కుళ్ళగించి సయికు తోటలోకి ఒక్క దూకు దూకింది. ముందు నడుస్తున్న వెంకటేశ్వర్లు ఒక్క క్షణం ఆగి కర్రను నేలను తాకించి వెనక్కి తిరిగి లక్షుమ్మ వైపు చూచేడు.

ఆమె కళ్ళల్లో బెరుకు..

చుట్టూ పొలాలు, చిమ్మ చీకటి... గబ్బగయ్యంగా ఉంది. వెంకటేశ్వర్లు కళ్ళతోనే ఆమెకు ధైర్యం చెప్పేడు.

కాస్సేపటికి గుళ్ళకమ్మ ఒడ్డుకు చేరేరు.

ఏరు ఎప్పటిలానే ప్రశాంతంగా ఉంది. నాలుగు రోజుల్నాటి భీభత్సం ఏమీ లేదు. చుక్కల వెల్తుర్లో మినుకు మినుకు మంటూ నీళ్ళు వెలుగుతున్నాయి. గుడ్డివెన్నెట్లో ఇసుక తళుక్కు తళుక్కుమని మెరుస్తోంది. రోజూ గొడ్లు మేసే తావుల్లో, తిరిగే తావుల్లో నిలబడి ఇద్దరూ మార్చుకుని మార్చుకుని అరుస్తూ గొడ్లను పిలుస్తున్నారు.

తూర్పు ఆకాశంలో ఎర్రడాలు కమ్ముకుంది. కీచురాల్లు రొదగా కాకుండా ఆగి ఆగి అరుస్తున్నాయి. ఇద్దరూ తిరిగి తిరిగి అలిసిపోయేరు. ఏటొడ్డున ఇసుకలో చతికిలపడ్డారు.

''అమ్మో! మచ్చల పడ్డ రాలేదయ్యా'' అంది లక్షుమ్మ ఆదుర్దాగా. వెంకటేశ్వర్లుకి అనుమానమేసింది. ఒంటిమీద చొక్కా విప్పి లక్షుమ్మ చేతికిచ్చేడు. చెవులకున్న దారం తీసి కళ్ళద్దాలు లక్షుమ్మ చేతిలో భద్రంగా పెట్టేడు. గుళ్ళకమ్మలోకి దిగి నడిచేడు. కాళ్ళు అందడంలేదు. ఈత కొట్టుకుంటూ ఏటి మధ్యనున్న దిబ్బ మీదకి చేరేడు. చిన్న పడ్డ దూడ ఒకటి చెంగు చెంగున దూకుతూ గంతులేస్తూ అక్కడ రెల్లు గడ్డి మధ్యలో తల్లితో ఆడుకుంటోంది. మచ్చలపడ్డ అప్పుడప్పుడూ బిడ్డను నాకుతూ దానివైపూ గుళ్ళకమ్మ దాటిని పశువుల వైపు చూస్తోంది. వెంకటేశ్వర్లు రాగానే అది ఆయన చెంతకు చేరి ఒరుసుకుని నిలబడింది. చుట్టూ చూచేడు వెంకటేశ్వర్లు. నీళ్ళ మధ్యలో ఉన్నాడు తను. రెండు చేతుల్తో దూడను ఎత్తుకున్నాడు.




''అమ్యోవ్! గొడ్లు మనకు ప్రాప్తం లేనట్టుందయ్యా.'' అంది కాసేపు తర్వాత లక్షుమ్మ లేచి నిలబడి. వెంకటేశ్వర్లు కూడా లేచి నిలబడి చివరిప్రయత్నంగా పూనకం వచ్చినట్లు రౌద్రంగా ''దా!దా!'' అంటూ నాలికతో రిచ్చకొట్టి అరిసేడు. ఆయన అరుపులకు గుళ్ళకమ్మ నీళ్ళు సైతం అలజడితో ప్రతిధ్వనించేయి.

లక్షుమ్మ కూడా అంతే గొంతుతో ''అంబ్యా... దా!దా!'' అంటూ పశువుల్ని కేకేసింది. గుళ్ళకమ్మలో చిన్న కదలిక... ఆ ఒడ్డుకూ ఈ ఒడ్డుకూ మధ్యలో రెల్లు గుబుర్ల మధ్యలోంచి ఈదుకుంటూ రెండు సంవత్సరాల దున్నకుర్ర ఒడ్డుకు చేరింది.

''అయ్యో! మన దున్నకుర్ర'' లక్షుమ్మ గట్టిగా అరిచింది. వెంకటేశ్వర్లు దున్న కుర్ర ఈదుకుంటూ వచ్చే దారుల్లోకి చూచేడు. రెల్లుగుబుర్ల మధ్యలో మినుకు మినుకుమంటూ చీకట్లో కళ్ళు మెరుస్తున్నాయి. లక్షుమ్మ ఆవైపు తిరిగి మళ్ళీ గొడ్లను కేకేసింది. మరో మూడు పశువులు ఈదుకుంటూ ఒడ్డుకు చేరేయి.

మొయ్యలేకపోయడు. ఎప్పుడు పుట్టిందో ఏమో అది చేతుల మధ్య నిలవడం లేదు. కిందకు దించేడు. మళ్ళీ రెండు చేతుల్తో ఎత్తుకుని ఒక్క అధాటున ఎత్తి భుజాల మీద వేసేకుని గుళ్ళకమ్మలోకి దిగేడు. ఎలాగో ఈదుకుంటూ అవతలి ఒడ్డుకు చేర్చేడు. వెనకే మచ్చలపడ్డ కూడా ఒడ్డుకు చేరింది.

''అయ్యోవ్! ఢిల్లీ పడ్డయ్యా'' అంది లక్షుమ్మ అబ్బురంగా. పంచె పిండుకుని, చొక్కా వేసుకుని, చెవులకు అద్దాల దారం తగిలించుకుని మచ్చల పడ్డ మెడను నిమిరేడు వెంకటేశ్వర్లు, అప్పటికే దూడ ఒళ్ళంతా తడిమింది లక్షుమ్మ.

''అయ్యోవ్! తొందరగా పా. పెరుగు బండికి మనవడికి జున్నుపాలు తీసుకుపోవాల'' అంది లక్షుమ్మ దంటుతో బటె గొడ్లను అదిలిస్తూ.

''ఇంకేడి జున్ను పాలే! ఈ బుజ్జి దానికి సరిపోయా'' అన్నాడు వెంకటేశ్వర్లు కళ్ళనిండా వెలుగు నింపుకుని.

★